ఆరోగ్య కేంద్రానికి రక్షణ

- రూ.4 లక్షలతో ప్రహరీ నిర్మాణం
- 20 రోజుల్లోనే పూర్తి

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రక్షణగా గోడ నిర్మించారు. దీంతో ఈ ప్రాంతంలో ఆకతాయిల ఆగడాలు, అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పడింది. ఈ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయి. గతంలో ఈ హెల్త్ సెంటర్‌కు రక్షణ గోడ లేకపోవడంతో స్థానికులు, రోగులు, సిబ్బంది కొంతమేర ఇబ్బంది పడేవారు. ఆస్పత్రి ఆవరణ ఓపెన్‌గా ఉండటంతో రాత్రి వేళ ఆకతాయిలు, మందుబాబులు అక్కడి చేరి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. మద్యం సీసాలు, కాల్చేసిన గంజాయి, సిగెరెట్లు తదితర వాటిని వాడి పడేసి అక్కడ వారికి ఇబ్బందులు పెట్టేవారు. ఈ సమస్యపై గతంలో 'రెచ్చిపోతున్న మందుబాబులు' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. ఆరోగ్య కేంద్రం చుట్టూ రక్షణ గోడ ఉంటే బాగుంటుందని స్థానికులు కోరారు. వారి విజ్ఞప్తిమేరకు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సమస్యను తెలుసుకుని, పరిశీలించారు. శివనగర్ హెల్త్ సెంటర్ వద్ద వెంటనే గోడ కట్టించేందుకు చర్యలు తీసుకున్నారు.


53వ వార్డు శివనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ముందు నిర్మించిన రక్షణ గోడ

శరవేగంగా నిర్మాణం

జీవీఎంసీ నిధులు రూ.4 లక్షలతో జూన్‌లో ఆరోగ్య కేంద్రం వద్ద రక్షణ గోడ నిర్మాణం మొదలుపెట్టి కేవలం 15 నుంచి 20 రోజుల్లోనే పనులు పూర్తి చేశారు. ఇప్పుడు అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పెద్ద గేటు కూడా అమర్చారు. ఎప్పటికప్పుడు నాయకులు, అధికారులు పరిశీలించడంతో సూచనలివ్వడంతో త్వరితగతిన ఇబ్బందులు లేకుండా ప్రహరీ నిర్మాణం పూర్తయింది. రక్షణ గోడ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయడంపై స్థానికులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సెక్యూరిటీ గార్డు అవసరం

శివనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి సంబంధించి సెక్యూరిటీ పోస్టును ఇంకా భర్తీ కాలేదు. చీకటి పడ్డాక ఆ రహదారి నిర్మానుష్యంగా ఉండటం వల్ల స్థానికులల్లో కొంత భయం ఉంది. అక్కడ శ్మశానవాటిక ఉండటం.. అందులోనూ కొన్ని చోట్ల వీధిలైట్లు వెలగకపోవడంతో కొంతమంది ఆవేదన వ్యక్తం చేశారు. సెక్యూరిటీ గార్డును నియమిస్తే ఆరోగ్య కేంద్రానికి, అటుగా ప్రయాణాలు సాగిస్తున్న వారికి ఇబ్బంది లేకుండా ధైర్యంగా ఉంటుందని పలువురు స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

లలితా పీఠంలో చండీ హోమం


చండీ హోమం చేస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో అధిక శ్రావణ మాసం, బహుళ అష్టమి సందర్భంగా బుధవారం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కార్యక్రమం జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసినిపూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి చేశారు. లోక కల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. దీని వల్ల ఆరోగ్యం, విజయం సిద్ధిస్తాయన్నారు. సాయంత్రం కాళీ కాలభైరవ హోమం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు


ఎలక్ట్రికల్ కాటాలను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల శాఖాధికారులు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో బుధవారం తూనికలు, కొలతల(లీగల్ మెట్రాలజీ) శాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి ధర్మకాటాల్లో కూరగాయల బరువును పరిశీలించారు. ఐదుగురు రైతుల వద్ద కాటాలకు సీల్ లేకపోవడంతో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రామారావు మాట్లాడుతూ ప్రతి రైతు ధర్మకాటాలకు సీల్ వేయించుకోవాలని సూచించారు. లేని పక్షంలో కాటాలను సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పర్యవేక్షించారు.

వాకర్స్ పార్కు సమస్యలపై వినతి

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్వీ సుధాకర్ కోరారు. ఈమేరకు వీరు 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌ను బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందించారు. పార్కులో ప్రధానంగా వాకింగ్ ట్రాక్ నిర్మాణం, సభా ప్రాంగణం ముందు పైకప్పు, ఆధునిక శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం, పార్కు సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కార్పొరేటర్ సానుకూలంగా స్పందించినట్లు అధ్యక్ష, కార్యదర్శులు చెప్పారు.

అణ్వస్త్ర అనర్థాలపై ఫొటో ఎగ్జిబిషన్


ఫొటోలను తిలకిస్తున్న విద్యార్థులు

సీతంపేట: నాగసాకి సంస్మరణ దినం సందర్భంగా అణ్వస్త్రాలు వద్దు.. అన్న వస్త్రాలు అందించండి అంటూ అణ్వాయుధాల వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అక్కయ్యపాలెంలోని ఒక పాఠశాలలో ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుదాడులు జరిగి 78 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో అణ్వస్త్ర రహిత ప్రపంచం కావాలని కోరుతూ బి.వి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థలు అణ్వాయుధాల దాడి వల్ల జరిగే అనర్థాలను వివరించేలా ఫొటోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, నాయుడు, ప్రిన్సిపాల్స్ ఎం.వి.వి.సత్యనారాయణ, శైలజ పాల్గొన్నారు.

జాలాది, మూర్తిలకు ఘన నివాళి

సీతంపేట: సినీ గేయ రచయిత డాక్టర్ జాలాది, సాంస్కృతిక రంగ నిర్వాహకుడు స్నేహాంజలి వి.ఎస్.మూర్తిల జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి జాలాది, మూర్తి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రరంగానికి జాలాది, సాంస్కృతిక రంగానికి వి.ఎస్.మూర్తి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ జాలాది, మూర్తిలతో కలిసి పనిచేయడం అదృష్టమని పేర్కొన్నారు. మూర్తి తనయుడు వి.బాలసుబ్రహ్మణ్యం, నిర్మాత పి.ఎస్.తిలక్, ప్రజా గాయకుడు దేవిశ్రీ, ఎం.వి.రాజశేఖర్, మెలోడి సత్యనారాయణ, ఎం.త్రినాథరావు, లోకేశ్వరరావు, నెహ్రూ, ప్రతాప్ తదితరులు నివాళులర్పించారు.


జాలాది, వి.ఎస్.మూర్తి చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న దాడి సత్యనారాయణ, కళాకారులు

'రఘువంశ దిలీపుడు'.. మహా కావ్యం


ప్రసంగిస్తున్న భమిడిపాటి లక్ష్మి

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో రఘువంశ దిలీపుడు అనే అంశంపై డాక్టర్ భమిడిపాటి లక్ష్మి ప్రసంగించారు. మహాకవి కాళిదాసు ఈ కావ్యంలో 27 మంది ఇనవంశ రాజుల గురించి ప్రస్తావించారన్నారు. దిలీప మహారాజు గుణగణాలను వివరిస్తూ సంతానార్థమై కుల గురువైన వశిష్ఠుడి ఆశ్రమానికి వెళ్లగా.. అతడు నందినీ దేనువుని సేవించమని చెప్పినట్టు తెలిపారు. ఫలితంగా మహారాజు సంతానవంతుడై దానికి రఘువంశమని నామకరణం చేశారన్నారు. ఈ కావ్యంలో కాళిదాసు మహాకవి వర్ణనలు ఎంతో సుందరములై రఘువంశం మహా కావ్యంగా నిలచిందన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ 5వ శతాబ్దంలో కాళిదాసు మహాకవి రాసిన రఘువంశ మహా కావ్యంలో ఇక్ష్వాకు వంశం గురించి, ముఖ్యంగా దిలీపుడి వృత్తాంతం ప్రస్తావించారని తెలిపారు. రఘువంశానికి ఆదిపురుషుడు వివస్వంతుడని పేర్కొన్నారు. అనంతరం రచయిత డాక్టర్ కె.జి.వేణు సమీక్షించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, జయంతి సూర్యనారాయణమూర్తి, టి.పి.ఎన్.ఆచార్యులు ప్రసంగించారు. కార్యక్రమంలో సిహెచ్.చిన సూర్యనారాయణ, భీమేశ్వరరావు, రామతాత, సురేష్, బి.రాధారాణి, ఆర్.వి.సుబ్బలక్ష్మి, ఆర్.ఎస్.మూర్తి పాల్గొన్నారు.

భార్యపై భర్త ఫిర్యాదు

మద్రిపాలెం: భార్యపై భర్త ఫిర్యాదు చేసిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. నేవల్ డాక్‌యార్డ్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ అనే వ్యక్తి 104 ఏరియా దరి మేఘాద్రిపేట నేవల్ క్వార్టర్స్‌లో నివసిస్తున్నారు. తన తల్లిదండ్రుల విషయంలో భార్య లతతో ఈయనకు మనస్పర్థలు వచ్చాయి. ఈమేరకు భర్త గతంలో కోర్టులో విడాకులకు అప్లై చేశారు. భార్య లత మాత్రం తన భర్తతోనే ఉంటానంటోంది. అతడు లేని సమయంలో తాళం పగలగొట్టి తన తల్లిదండ్రులతో కలిసి ఆమె ఇంట్లోకి ప్రవేశిస్తుండేది. తాను విడాకుల కోసం దరఖాస్తు చేసినా.. ఎందుకు ఇంటికి వస్తున్నావని భర్త ప్రభాకర్ భార్యను ప్రశ్నించారు. ఇలా తరచూ భార్య ఇబ్బంది పెట్టడంతో భర్త బుధవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఈ దంపతులు ఆరిలోవలో నివసించేవారు. ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ప్రభాకర్ ఒంటరిగా నేవల్ క్వార్టర్స్‌లో ఉంటున్నారు. సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఉమెన్ ఎస్‌ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'అర్హులందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి'

మహారాణిపేట: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ సూచించారు. దక్షిణ నియోజకవర్గంలోని వెలంపేట పరిధిలో 91, 98 పోలింగ్ బూత్‌ల పరిధిలో నిర్వహించిన ఇంటింటికీ ఓటరు సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బీఎల్‌వోలు డోర్ టు డోర్ వెరిఫికేషన్‌కు వచ్చినప్పుడు ఓటరు వివరాలు, డోర్ నెంబరు సరిగ్గా ఉన్నది, లేనిదీ పరిశీలించుకోవాలన్నారు. పాత ఓటర్ల వివరాలు, కొత్తగా చేరిన వారి నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కేంద్రం మెతక వైఖరితోనే మణిపూర్‌లో హింస



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న బ్యాంకు మహిళా ఉద్యోగులు

సీతమ్మధార: ప్రధాని మోదీ మణిపూర్ హింసాకాండపై స్పందించి అక్కడి ప్రజలను రక్షించాలని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదురుగా రోడ్డులో బుధవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎం.శ్రీనివాస్, ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ మే 4న మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడం దేశాన్ని ఉల్కిపడేలా చేసిందన్నారు. ఈ ఘటన జరిగి 95 రోజులు కావస్తున్నా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మౌనం పాటించిందని విమర్శించారు. ప్రపంచ స్థాయిలో మన దేశాన్ని దిగజార్చిన ఈ ఘటనపై మోదీ పార్లమెంట్‌లో స్పందించకపోవడం, మణిపూర్‌ని సందర్శించకపోవడం నిందితులకు బలాన్ని ఇస్తుందన్నారు. ప్రభుత్వ అండతో అక్కడ దుర్మార్గ శక్తులు రెచ్చిపోతున్నాయని ధ్వజమెత్తారు. మణిపూర్‌ను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.మణి, కె.సత్యవతి, బి.రత్నం, వై.తులసి, ఆర్.శోభారాణి, ఎస్.పద్మ, వి.మేరి, వై.సీతారత్నం, జి.మంగశ్రీ, సావిత్రి , వరలక్ష్మి పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిభద్రతలు కాపాడాలి

మణిపూర్‌లో మహిళలకు జరిగిన అన్యాయ్యాన్ని ఖండిస్తూ ఏపీటీబీఈఎఫ్ వుమెన్ కౌన్సిల్ ఆదేశాల మేరకు విశాఖ జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీబీఈఎఫ్ అసిస్టెంట్ కన్వీనర్ వైశాలి మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి భద్రతలు కాపాడాలన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా మహిళలపై దాడులు విపరీతంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి ఆర్.వసంతరావు, ప్రసాద్, కమలాకర్, స్వాతి, సుజాత, ప్రత్యూష పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన ఇద్దరి అరెస్ట్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న కేరళకు చెందిన ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్, ద్వారకా పోలీసుల ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని బుల్లయ్య కళాశాల ఎదురుగా గల ప్రభుత్వ కంటి ఆస్పత్రి వద్ద అనుమానస్పదంగా ఇద్దరు యువకులు మహ్మద్ సూహబ్, మహ్మద్ శిబిలీ కనిపించడంతో టాస్క్‌ఫోర్స్, ద్వారకా పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఎస్ఐ ధర్మేంద్ర తన సిబ్బందితో వారి బ్యాగులు తనిఖీ చేశారు. 22 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు. ఒడిశా జిల్లా గుణుపూర్ నుంచి విశాఖపట్నం మీదుగా కేరళ వెళ్లేందుకు గంజాయి తీసుకొచ్చినట్లు పోలీసులు చెప్పారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావుకు ఆత్మీయ వీడ్కోలు


కోటేశ్వరరావును సత్కరిస్తున్న జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన కోటేశ్వరరావు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జీఆర్పీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ (డీఎస్‌ఆర్పీ) బి.మోహనరావు ఆధ్వర్యంలో బుధవారం కోటేశ్వరరావును శాలువాతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన సుమారు రెండేళ్లుగా జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌గా ఎటువంటి వివాదాలకు తావులేకుండా, నిబద్ధతతో విధులు నిర్వర్తించారని సిబ్బంది కొనియాడారు. ఈయనను విశాఖపట్నం రేంజ్‌కు బదిలీ చేసినట్లు సిబ్బంది తెలిపారు.

సబ్సిడీపై టమాటా విక్రయాలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సబ్సిడీ టమాటా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బజార్‌లోని రెండు కౌంటర్లలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి ఒక్క కిలో చొప్పున రూ.50కు టమాటాలు విక్రయించారు. ఆధార్, రేషన్ కార్డులతో వచ్చిన వినియోగదారులు కొనుగోలు చేశారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్, సిబ్బంది పర్యవేక్షించారు.

విష్ణు సహస్రనామ పఠన యజ్ఞం


విష్ణు సహస్రనామార్చనలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ బాలభాను విద్యాలయంలో విశ్వాస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం విష్ణు సహస్రనామ పఠన యజ్ఞం నిర్వహించారు. వివిధ నగరాల్లో 10 లక్షల విద్యార్థులతో ఈ యజ్ఞం నిర్వహిస్తున్న నేపథ్యంలో విశాఖలోని బాలభాను పాఠశాల 10వ తరగతి బాలబాలికలతో విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఈ కార్యక్రమాన్ని బాలభాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్వీఎస్.శుభశ్రీ, విశ్వాస్ సంస్థ ప్రతినిధి నాయిని వీరభద్రమ్మ, కె.లక్ష్మి పర్యవేక్షించారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

మహారాణిపేట: పిల్లల్లో ఎన్నో వ్యాధులకు కారణమైన నులి పురుగుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినంగా పాటిస్తూ పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 1900 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 62 కాలేజీలు, 742 అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 4,75,358 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి గురువారం ఉచితంగా మాత్రలు అందిస్తామన్నారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలన్నారు. 3 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు పూర్తి మాత్ర ఇచ్చి చప్పరించాలని సూచించారు. మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తర్వాత మాత్ర ఇవ్వాలన్నారు. గురువారం మాత్రలు వినియోగించలేని వారి కోసం తిరిగి ఈనెల 17న మాప్ ఆప్ రౌండ్ కింద అవసరమైన వారికి మాత్రలు అందిస్తామన్నారు. 5,20,000కు పైగా మాత్రలు సిద్ధం చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. నోడల్ అధికారి డి.రమారెడ్డి, ప్రొగ్రామ్ అధికారి డాక్టర్ సమత, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ బేగం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'


ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్జీలను పరిశీలించి కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. కార్యక్రమంలో పలువురు వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల విజేతలకు ఘన స్వాగతం


సిల్వర్ మెడల్స్ సాధించిన స్థానిక క్రీడాకారులు పాండవ మణికంఠ, ముసినాడ నితీష్

సీతంపేట: భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ దుబాయ్ మల్టీపుల్ గేమ్స్–2023 ఫుట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు అండర్ 17 విభాగంలో సిల్వర్ కప్ గెలుపొందింది. ఈ జట్టులో నగరంలోని అక్కయ్యపాలేనికి చెందిన విద్యార్థులు పాండవ మణికంఠ, ముసినాడ నితీష్‌లు సభ్యులుగా ఉన్న విషయం తెలిసిందే. సిల్వర్ మెడల్ గెలుపొంది విశాఖలో అడుగుపెట్టిన వీరికి బుధవారం ఘన స్వాగతం లభించింది. వారి తల్లిదండ్రులు పాండవ ఈశ్వరరావు, శోభ, ముసినాడ త్రినాథ్, సుమధుర, వారి బంధువులు, స్నేహితులు విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో విజేతలకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. వీరు చదువుతున్న నారాయణ ఒలింపియాడ్ స్కూల్ యాజమాన్యం అభినందించింది. ప్రతిభ చూపిన క్రీడాకారులను ప్రోత్సహించాలని మణికంఠ తండ్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పాండవ ఈశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు.

గెడ్డ వద్ద ర్యాంప్ లేక ఇబ్బందులు


ఎన్జీజీవోస్ కాలనీలో ర్యాంపు నిర్మించాల్సిన గెడ్డ ప్రదేశం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీ గెడ్డలో పూడిక తొలగించేందుకు వీలుగా నాగరాజు ఎన్‌క్లేవ్ ఎదుట ర్యాంప్ నిర్మించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు. గెడ్డలోకి పొక్లెయిన్ దిగి వెళ్లే అవకాశం లేక పూడిక తొలగించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. గెడ్డలో పూడికలు, వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన, దోమలు వృద్ధి చెందుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదుతో గత నెలాఖరులో గెడ్డ రక్షణ గోడ తొలగించి పొక్లెయిన్ దింపి పూడికలు తొలగించారని స్థానికులు చెబుతున్నారు. అనంతరం తిరిగి గోడ యథావిధిగా నిర్మించేశారని, మున్ముందు పూడిక తొలగించాలంటే మళ్లీ గోడను తొలగించాల్సి వస్తుందని, దీనివల్ల జీవీఎంసీకి నిర్వహణా భారం పెరుగుతుందన్నారు. జగ్గారావు బ్రిడ్జి వద్ద నిర్మించినట్టు ర్యాంప్ నిర్మించి ఐరన్ గేటు ఏర్పాటు చేస్తే, జేసీబీ గెడ్డలోకి దిగడానికి వీలుగా ఉంటుందని, ఎప్పుడు కావాలంటే అప్పుడు పూడిక తొలగించే వీలు ఏర్పడుతుందని స్థానికులు సూచిస్తున్నారు. గెడ్డ వద్ద ర్యాంపు నిర్మించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దేశంపై ప్రేమ, ప్రకృతి పరిరక్షణ అవసరం

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- మేరీ మాటీ–మేరీ దేశ్ కార్యక్రమంలో మొక్కలు నాటిన విద్యార్థులు


మొక్కలు నాటుతున్న వీసీ ప్రసాదరెడ్డి, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: దేశాన్ని ప్రేమించడం, ప్రకృతిని పరిరక్షించడం యువత అలవరచుకోవాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పక్కన ఉన్న స్థలంలో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి లక్ష్మణ ఫలం, రామాఫలం, సీతాఫలం, జామ, దాల్చిన, ఉసిరి, మారేడు, జమ్మి, గుగ్గిలం, పనస, వాటర్ యాపిల్, పారిజాతం తదితర మొక్కలను నాటారు. ప్రకృతిని పరిరక్షించడంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. వర్సిటీలో పలు చోట్ల నాటిన మొక్కలను విద్యార్థులు దత్తత తీసుకుని సంరక్షించే బాధ్యత స్వీకరించాలని సూచించారు. దేశం ప్రథమం అనే నినాదంతో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ భద్రత, ప్రగతి ఎంతో ముఖ్యమన్నారు. దేశ భక్తిని కలిగి ఉంటూ, దేశం కోసం పని చేయాలని యువతకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశ్రాంత సైనికోద్యోగులను సత్కరించారు. త్రివిధ దళాలలో సేవలందించి పదవీ విరమణ చేసిన కమోడోర్ ఆర్.కె.గోస్వామి, కల్నల్ వెంకట గణపతి, కెప్టెన్ దాడి నారాయణరావు, సీపీవో ఎ.వెంకటరమణ, సుబాన్ షేక్, నాయక్ సుబేదార్ శ్రీధర్ బాబులను సన్మానించారు. వారి సేవలను ఈ సందర్భంగా శ్లాఘించారు. అనంతరం విద్యార్థులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, టి.శోభశ్రీ, వి.విజయలక్ష్మి, ఎస్.కె.భట్టి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, డీన్ జి.వీర్రాజు, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ప్రకాష్, ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఉద్యానవనంలో నాటిన పండ్ల మొక్కలను నగరానికి చెందిన కీర్తి పట్నాయక్, అరుదైన ఔషధ మొక్కలను గ్రీన్ క్లైమే ట్ ప్రతినిధి రత్నం అందించారు.


మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మేరీ మాటి – మేరా దేశ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గౌరవించాలన్నారు. అమరవీరుల గౌరవ సూచికంగా దేశంలో వివిధ ప్రాంతాలలో గ్రామ శాసనాలను ఏర్పాటు చేశారన్నారు. వీటి ద్వారా 7500 కలశాలలో మట్టి మొక్కలను సేకరించి జాతీయ స్మారక స్తూపం పక్కన అమృత్ వాటిక పేరుతో ప్రత్యేక స్తూపం ఏర్పాటు చేయనున్నారన్నారు.

నేడు ఏయూలో ఉద్యోగ మేళా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో, మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్ ఇండియా సంస్థలో ఫార్మాసిస్ట్, ఫార్మసీ ఎయిడ్, సీఎస్, డెలివరీ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. మొత్తం 90 ఖాళీలను భర్తీ చేస్తామని, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ కోర్సులను పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునన్నారు. నెలకు రూ.11,080 నుంచి రూ.16 వేలు మధ్య వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు ఝిట జౌర్. జీ వెబ్‌సైట్ నుంచి వివరాలు నమోదు చేసుకుని గురువారం ఉదయం 10.30 గంటలకు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. పూర్తి సమాచారం కోసం 96660 92491 నంబరులో సంప్రదించాలన్నారు.